క్లుప్తంగా

నేడు, రేపు వాలీబాల్ పోటీలు



మురళీకృష్ణ

కొయ్యూరు: కొండగోకిరిలో శని, ఆదివారాల్లో డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను దివంగత బీజేపీ నేత లోకులగాంధీ పేరిట నిర్వహిస్తున్నట్టు తోడు సంస్థ ప్రతినిధి, కొండగోకిరిని దత్తత తీసుకున్న మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. కొండగోకిరిలో యువ సైన్యం ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. ఏటా లోకులగాంధీ పేరిట క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఈ ఏడాది వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీల్లో మొదటి బహుమతిగా రూ.12,500తో పాటు టోర్నీ కపను, రెండో బహుమతిగా రూ.6,500తో పాటు టోర్నీ కపను అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9121374302, 9491432841 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



ట్రోఫీ అందుకున్న విజేత జట్టు

మోతుగూడెం: పొల్లూరు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సుమారు రెండున్నర దశాబ్దాలుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది గుర్తుత్తి గోవిందరాజు మెమోరియల్ టోర్నమెంట్ పేరుతో నిర్వహించినట్టు చెప్పారు. బ్లూస్టార్, మ్యారెజ్–11 మధ్య జరిగిన పోటీలో బ్లూస్టార్ జట్టు విజయం సాధించింది. విన్నర్, రన్నర్ టీమ్‌లకు బహుమతులను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు దొర తదితరులు

గంగవరం : స్థానిక వినాయక ఆలయం ఆవరణలో శారపు పావని, పరదా సంధ్యా ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉప సర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు దొర, వార్డు మెంబర్ రామలక్ష్మి, విశ్వహిందు పరిషత్ ప్రముఖ్ ప్రసాద్ , హెచ్‌సీ కళ్యాణ్ బహుమతులు అందచేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు విజ్ఞప్తి

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 20న కళాశాలలో రిపోర్టు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి సూచించారు. నిరుద్యోగ యువతీ యువకులతో పాటు తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

వరి నారుమడిలో తామర పురుగుల బెడద

అనకాపల్లి: మారుతున్న వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో తామర పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున, లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరినారు మడిలో కనిష్ట ఉష్ణోగ్రతల వల్ల పైరు పెరగకుండా ఉన్నట్లయితే బూస్టర్ ఎరువులు 2 కేజీ యూరియా 2 కేజీ, పొటాష్ లేదా నీటిలో కలిపి ఎరువులు ఒక శాతం యూరియా లేదా 0.5శాతం మల్టీ కెను జింక్ సల్ఫేట్ 2 గ్రా/లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రాగిపైరు నాటే రైతులు దుక్కిలో 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. అపరాలలో చిత్త, రసం పీల్చు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.

అపరాలలో బూడిద తెగులు గమనించినట్లయితే హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ పిచికారీ చేసుకోవాలన్నారు. నువ్వులు ఎకరా కు 10 కిలోల ట్రైకోడెర్మా, ఒక బస్తా డీఏపీని విత్తేముందు ఆఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు.



డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న అరకు వారపుసంత ప్రాంగణం



మార్కెట్ షెడ్లు వద్ద పేరుకుపోయిన చెత్త

పడకేసిన పారిశుధ్యం

- సంతలో పేరుకుపోయిన చెత్తా చెదారం
- కొనుగోలుదారులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



సంతలో చెత్త చెదారం చెంతనే ఏర్పాటుచేసిన దుకాణాలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంత డుంబ్రిగుడ, అరకులోయ మండలాలతో పాటు ఒడిశా ప్రాంతం వాసులకు ఎంతో ప్రాచుర్యం ఉంది. అలాంటి వారపు సంత ప్రస్తుతం కంపుకొడుతుంది. సంతలో గిడ్డంగులు, సంత షెడ్లు వద్ద, గోడౌన్‌ల వద్ద రోజుల తరబడి చెత్తా చెదారం పేరుకుపోయింది.దీంతో సంతకు వచ్చిన వారంతా ముక్కుమూసుకొని ఉండాల్సి దుస్థితి నెలకొంది. తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో చేపల మార్కెట్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుచేయడంతో మందుబాబులు వినియోగిస్తున్నా ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లతో చెత్తా ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో ఈ ప్రాంతం అధ్వానంగా మారిందని గిరిజనులు వాపోతున్నారు. సంతలో రోజుల తరబడి చెత్త తొలగింపు పనులను అధికారులు చేపట్టపోవడంతో దుర్గంధంతో ఉండలేకపోతున్నామని పలువురు చెబుతున్నారు. దోమలు ఉధృతి వల్ల రోగాలు ప్రబలే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అరకు వారపు సంతలో పేరుకుపోయిన చెత్తా , చెదారాలను తొలగించాలని, బ్లీచింగ్ వంటి కార్యక్రమాలు తరచూ చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ సంతలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సంతలో చెత్త తొలగించాలి



వారపు సంతలో చెత్తా ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో సంతకు వచ్చే వారికి ఇబ్బందిగా ఉంది. చేపలు కొనేందుకు మార్కెట్‌లో వచ్చే దోమలు, దుర్వాసనతో ముక్కు మూసుకొవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సంతలో చెత్తా చెదారం తొలగించాలి.

– బి.రవికుమార్, డుంబ్రిగుడ

నేడు పంచాయతీ కార్యాలయంలో విద్యుత్ బిల్లుల స్వీకరణ

కూనవరం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కపూర్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన అవసరం



సిబ్బందికి మెడికల్ కిట్లను పంపిణీ చేస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: ప్రతినెల మొదటి శుక్రవారం గ్రామస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని సీడీపీవో విజయకుమారి వర్కర్లను ఆదేశించారు.ఆమె కార్యాలయంలో వర్కర్లతో ప్రాజెక్ట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదట గ్రామ స్థాయిలోనే బాల్య వివాహాలపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. ప్రతీ నెల ఈ అంశంపై కలెక్టర్ సమీక్ష ఉంటుందన్నారు. ఆమె సిబ్బందికి మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. చిన్నారులకు ఎలాంటి అనారోగ్యం సోకినా ప్రథమ చికిత్స చేసేందుకు వినియోగించాలని సూచించారు.

ఉపాధి వేతనదారుల సమస్యలు పరిష్కరించాలి



వనుగుమ్మలో నిరసన తెలియజేస్తున్న కూలీలు

ముంచంగిపుట్టు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని దినాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో జరుగుతన్న ఉపాధి హామీ పనులను సీఐటీయూ నేతలు శుక్రవారం పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి కూలి పెంచాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీటూ నేతల ఆధ్వర్యంలో కూలీలు నిరసన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలకు 250 రోజులు పని దినాలు కల్పించాలని, 600 రూపాయాలు వేతనాలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అనేక సమస్యలతో కూలీలు అవస్థలు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు ఉండేలా చూడాలని, ప్రతి కూలీకి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పని ముట్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. నేతలు చండల్, సంతన్న, డుంబ్రు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛదివస్

అరకులోయ టౌన్: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లవరాజు తెలిపారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తప్పక హాజరు కావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో కోరారు.

ఉపాధి ఏపీవోగా రెడ్డిబాబు బాధ్యతల స్వీకరణ



రెడ్డిబాబు

రాజవొమ్మంగి: స్థానిక ఉపాధి హామీ ఏపీవోగా రెడ్డిబాబు నియమితులయ్యారు. రంపచోడవరం నుంచి వచ్చిన ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీఓగా పనిచేసిన వందే సురేష్‌కుమార్ పాడేరు కలెక్టర్ ఆఫీస్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. అక్కడ ఆయన విజిలెన్స్ శాఖకు బదిలీ అయినట్లు ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి



దొరగూడ గ్రామస్తులతో మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ కె.త్రినాథ్ అన్నారు. గ్రామంలో సర్పంచ్ త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధురాంలు శుక్రవారం సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రహదారి, కమ్యూనిటీ భవన పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ దొరగూడలో పీఎం జన్‌మన్ గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని, ఉపాధి పనులు కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్ సత్యం, గ్రామస్తులు లక్ష్మణ్, సాంబ్రు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

64 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని తంటికొండ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 64 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసినట్టు 104 డీఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఉచితంగా మందులు అందజేశామన్నారు. చలికాలంలో చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాలని తెలియజేశామని, గర్భిణుల ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించినట్టు ఎంఎల్‌హెచ్‌పీ రేవతి అన్నారు. ఏఎన్‌ఎం కమల, హెచ్‌వీ రమాబాయి, 104 పైలెట్ కనకరాజు, ఆశ వర్కర్‌లు చెల్లమ్మ, దుర్గ, అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్ని దుస్తులకు గిరాకీ



ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

డుంబ్రిగుడ: మండలంలోని రోజురోజుకు చలి తీవ్రత అధికంగా ఉండటంతో ఉన్ని దుస్తులు, జెర్కిన్‌ల వినియోగం పెరిగింది. చలి బారి నుంచి రక్షించుకోవడానికి తప్పనిసరిగా వినియోగించాల్సి ఉంటుంది. ఈ కారణంగా ప్రస్తుతం వారపు సంతల్లో ఉన్ని దుస్తులు, జెర్కిన్‌లు, మఫ్లర్లులకు డిమాండ్ నెలకొంది. ఒక్కో స్వెట్టర్ రూ.500 నుంచి రూ.1000ల వరకు విక్రయిస్తున్నారు. సాయంత్రం 4గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 10 గంటలైనా మంచు తెరలు వీడడం లేదు. పెరుగుతున్న చలి నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామస్తులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



జర్రెలలో వైద్య సేవలు అందజేస్తున్న వైద్యాధికారి శిరీష, సిబ్బంది

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఎఫ్‌డీపీ వైద్య శిబిరం నిర్వహించి 58 మందికి వైద్య సేవలందించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, టీబీ వంటి వ్యాధులపై గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. కిలగాడ వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, ఈశ్వరి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



మొల్లేరులో ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

గంగవరం : మొల్లేరు కాటమస్వామి జాతరలో ఏ విధమైన జూద క్రీడలు, అశ్లీల నృత్యాలుగాని నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ బి.వెంకటేష్ తెలిపారు. మొల్లేరు గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. గ్రామంలో నిర్వహించనున్న కాటమస్వామి జాతర ఏర్పాట్లు పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జాతరలో జూద క్రీడలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండ చూడాలని, వివాదాలకు తావులేకుండా జాతరను ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు.

అదుపులో జూదట, కోడిపందెంరాయుళ్లు

మండలంలోని బి.శివరామపట్నం, మొల్లేరు శివారులో కోడిపందాలు, జూదం ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా బి.శివరామపట్నంలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని, మొల్లేరు శివారులో కోడిపందాలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

రహదారి, వంతెన నిర్మాణానికి నిధుల కోసం వినతి



వినతిపత్రాన్ని చూపిస్తున్న నాయకులు

పాడేరు రూరల్: తారురోడ్డు, వంతెనలు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతు సీపీఎం నాయకుడు రామరావు, గిరిజనులు శుక్రవారం పాడేరు ఐటీడీఏ గ్రీవెన్స్‌లో పీవో, సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేసినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకులోయ మండలం బస్కీ పంచాయతీ గిర్లిగుడ నుంచి డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయితీ పరిశీల గ్రామం వరకు రహదారి అధ్వానంగా ఉందని, రాకపోకలకు ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో రహదారి, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నాయకులు, గ్రామస్తులు రాము, బాలరాజు, హరికృష్ణ, అర్జున్, పొత్తి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వాహనాలు ... జనం బెంబేలు



గంగవరంలో జాతీయ రహదారి ఇదే

గంగవరం : రంపచోడవరం ఏజెన్సీ నుంచి పాడేరు, అరకు ఏజెన్సీ వరకు నిర్మిస్తున్న 516ఈ జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐ.పోలవరం సెంటర్ నుంచి గంగవరం మీదుగా వేటమామిడి వరకు కల్వర్టులు మినహా దాదాపు జాతీయ రహదారి నిర్మాణం పూర్తయింది. రహదారి విస్తరణ పెరగడంతో అడ్డతీగల – గంగవరం రూట్ బాగా రద్దీ పెరిగింది. దీనికి తోడు ద్విచక్ర వాహనాలు, కారులు, ఆటోలు, లారీలు శరవేగంగా ప్రయాణిస్తున్నారు. గ్రామాల్లో సైతం వాహనాలు స్పీడు తగ్గడం లేదు. జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా మంది మద్యం సేవించి మరీ వాహనాలు వేగంగా నడుపుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రూట్‌లో పలు గ్రామాల్లో రహదారికి ఆనుకొనే పాఠశాలలు కూడా ఉన్నాయి. వాహనాలు వేగంగా ప్రయాణిస్తుండడం వలన తమ పిల్లలకు, వృద్ధులకు ఏ ప్రమాదాలు జరుగుతాయోనని అడ్డపల్లి, చిన్నఅడ్డపల్లి, ఏటిపల్లి గంగవరం, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందారని చెబుతున్నారు. ఈ రూట్‌లో వాహనాలు వేగాన్ని నియంత్రించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయంపై ఎస్‌ఐ వెంకటేష్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం ద్విచక్ర వాహనచోదకులు, ఆటో డ్రైవర్లకు, అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

గ్రామాల్లో సంక్రాంతి సందడి

వారం రోజుల పాటు వేడుకలు



గుంటసీమలో స్థానికులతో కలిపి థింసా నృత్యం చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు



కంద్రూమ్ పంచాయతీలో గ్రామస్తులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న వైస్ ఎంపీపీ ఆనందరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు హరి

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ, కితలంగి, కంద్రుమ్, సొవ్వా, అరకు తదితర గ్రామాల్లో సంక్రాంతి పండగ ఉత్సవాలు వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్‌లు, గుమ్మ నాగేశ్వరరావు, సుబ్బారావు, హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావులు తెలిపారు. మంగళ, బుధ, గురు వారాలతో పాటు శుక్ర, శని, ఆది, సోమవారలలో పండుగను పురష్కరించుకొని గ్రామాల్లో సాంస్కతిక కార్యక్రమలు థింసా నృత్యాలు, బుడియాల సందడి కనిపిస్తోందన్నారు. వారం రోజల పాటు గ్రామాల్లో మహిళలు, పురుషులు ఎటువంటి పనులకు, కూలీలకు వెళ్లకుండా పండుగలో పాల్గొవాలని సూచించారు.

దళారుల దందా.. రైతుల బెంగ

- సిండికేట్‌గా మైదాన ప్రాంత వ్యాపారులు
- పసుపు, కాఫీలకు గిరాకీ
- అల్లం, టమాటా, కూరగాయలకు ధరలు పతనం
- గిరిజనుల అవస్థలు ..పట్టించుకోని అధికారులు



సంతకు తీసుకొచ్చిన కాఫీ బస్తాలు



విక్రయించేందుకు తీసుకొచ్చిన అల్లం



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకులో శుక్రవారం జరిగిన వారపు సంతలో కాఫీ, అల్లం, చిరుధాన్యాలు, పప్పు ధినుసులకు గిరాకీ నెలకొంది. కాఫీ పల్పింగ్ కిలో రూ.255, కిలో అల్లం రూ.35 నుంచి రూ.50, పసుపు మొదటి రకం రూ.120 నుంచి రూ.140 వరకు విక్రయించారు. మైదాన ప్రాంత వ్యాపారస్తులు సిండికేట్ అయి కొనుగోలు చేశారు. చిరుధాన్యాల్లో చోడి, కొర్రలు, సామలు, జొన్నలు రూ.30లతో కొనుగోలు చేశారు. పప్పు ధినుసులు బొబ్బర్లు, రాజ్‌మా, ఎర్రటి రాజ్‌మా కిలో రూ.120ల వరకు అమ్మకాలు జరిగాయి. దీంతో కొంత మేర గిరిజనులకు గిట్టుబాటు ధరలు లభించాయి. అయితే టమాటా, వివిధ రకాల కూరగాయలకు ధరలు పూర్తిగా పడిపోయాయి. టమాటా 20 కిలోలు రూ.350 నుంచి రూ.500లకు విక్రయించారు. కూరగాయలకు రేట్లు పడిపోవడంతో గిరిజన రైతులు ఇబ్బందులు పడ్డారు. వారపుసంతలో దళారుల బెడదతో పాటు సిండికేట్లను నియంత్రించాలని గిరిజనులు కోరుతున్నారు.